క్లుప్తంగా

బెటాలియన్‌లో ఓపెన్‌హౌస్



అయుధాల పనితీరు వివరిస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గుడిపేట మౌంట్ కార్మల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలను ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఎం.ఐ.సురేశ్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైనీజోర్జ్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విదేశాలలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు చేసిన వారికి ప్రభుత్వం 100మందికి విదేశాల్లో నర్సింగ్ ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. తెలంగాణ కార్మిక ఉపాధిశిక్షణ కర్మాగారాల శాఖ ద్వారా రిజిస్టరైన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం)నర్సింగ్ పారామెడికల్ కోర్సులు చేసిన వారికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు. జర్మనీ, జపాన్, యూఎస్ఏ, యూకే, కెనడాలలో ఉద్యోగాలు చేయాలనుకునేవారు బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం కోర్సులు చేసి 2సంవత్సరాల అనుభవం ఉన్నవారు, ఈ నెల 25లోగా హైదరాబాద్‌లోని విజయనగర్ కాలనీలో గల మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌కు అభ్యర్థుల బయోడేటా పంపించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 6302292450, 7893566493లో సంప్రదించాలన్నారు.

'ఇరువర్గాలపై కేసు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకోవడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. హాజీపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామానికి చెందిన పులిశెట్టి హరీశ్, పొట్టాల ఆకాంక్ష ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరువురి కులాలు వేరుకావడంతో ఆకాంక్ష తల్లిదండ్రులకు ఇష్టం లేదు. హరీశ్ కుటుంబ సభ్యులను వారు తరుచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అమ్మాయి కుటుంబ సభ్యులైన పొట్టాల రవీందర్, శ్రీశైలంగౌడ్ హరీశ్ ఇంటికి వచ్చి వారి కుటుంబ సభ్యులతో వాదనకు దిగారు. ఒకరికొకరూ పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇరువర్గాలకు గాయాలయ్యాయి. మంగళవారం ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, హాజీపూర్ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

కల్మలపేటలో విద్యా దినోత్సవం బహిష్కరణ



నిరసన తెలుపుతున్న విద్యార్థులు,తల్లిదండ్రులు

వేమనపల్లి: సమస్యలు తీర్చకుంటే విద్యార్థులు పాఠశాలకు రారని కల్మలపేట ఎంపీయూపీఎస్ పాఠశాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులతో మంగళవారం నిరసనకు దిగారు. విద్యా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు తల్లిదండ్రుల జోక్యంతో బహిష్కరించి, పాఠశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులు బడికి రావడం మానేస్తారని హెచ్చరించారు.

'కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటాం'

జన్నారం: కార్మికుల కోసం వచ్చిన పథకాలు అర్హులైన వారికి అందించి, అన్ని విధాల ఆదుకుంటామని మంచిర్యాల జిల్లా లేబర్ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న 15మంది మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షుడు ముల్కల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డుపై చెత్త వేస్తే చర్యలు'

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పై చెత్త వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. స్వచ్ఛ చెన్నూర్‌లో భాగంగా మంగళవారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కొత్త బస్టాండ్ సమీపంలో పండ్ల షాపు యజమాని రోడ్లపై చెత్త వేయడంతో రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలని తెలిపారు.



మంచిర్యాలఅర్బన్: విద్యార్థినికి సన్మానం



చంద్రవెల్లిలో ర్యాలీ



హాజీపూర్‌లో గ్రంథాలయం ప్రారంభం

ఘనంగా విద్యా దినోత్సవం



బెల్లంపల్లి: ఉపాధ్యాయులకు సన్మానం



తాండూర్: పుస్తకాల పంపిణీ



తీగలపహాడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో



ఆస్నాద్ పాఠశాలలో యూనిఫాం అందిస్తూ..



కాసిపేటలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

చెన్నూర్/కాసిపేట/లక్సెట్టిపేట/వేమనపల్లి/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/బెల్లంపల్లి/చెన్నూర్ రూరల్/తాండూర్/నస్పూర్/మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కరపత్రాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి పిల్లలను సర్కారు పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పలుచోట్ల డిజిటల్ బోర్డులను, గ్రంథాలయాలను ప్రారంభించారు. వివిధ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. జాతీ య జెండా ఆవిష్కరించారు. ఉత్తమ విద్యార్థులను అభినందించారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇటీవల రెగ్యులరైజ్ అయి న అధ్యాపకులకు సన్మానం చేశారు. కాసిపేటలో విద్యార్థుల నృత్యాలు, బతుకమ్మ ఆట పలువురి ఆకట్టుకుంది.



లక్సెట్టిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చెన్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో...



దండేపల్లి: విద్యార్థుల నృత్యప్రదర్శన

విద్యారంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: విద్యారంగాన్నీ బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శక్తి వంచనలేకుండా కృషి చేస్తున్నారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవం నిర్వహించారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మనఊరు-మనబడి' కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూ.75లక్షలతో కొత్తగా నిర్మించిన డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, కాంపౌండ్‌వాల్, బాలికల మరుగుదొడ్లు, డిజిటల్ తరగతులను ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అందులో భాగంగానే 'మనఊరు-మనబడి' కార్యక్రమం ప్రారంభించి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. జిల్లా పరిషత్ వైస్ చై ర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శంకర్ గౌడ్, వార్డు కౌన్సిలర్ ఆస్మాషేక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెన్నెల: విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కుశ్నపల్లి ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు-మనబడి'లో పూర్తయిన పనులు, డిజిటల్ తరగతులను ఎమ్మెల్యే చిన్నయ్య ప్రారంభించారు. సర్కారు బడుల్లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ తొంగల సత్యనారాయణ, జెడ్పీటీసీ సింగతి శ్యామల, సర్పంచ్ సంధ్య, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం పద్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, నాయకులు రాంచందర్, భీమాగౌడ్, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

భీమిని: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలవంటివని ఎమ్మెల్యే చిన్నయ్య అన్నారు. విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని కన్నెపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు టెస్ట్‌బుక్స్, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, జెడ్పీ సీఈఓ నరేందర్, డీఎల్‌పీఓ ఫణీందర్‌రావు పాల్గొన్నారు.

'విజయ డెయిరీ యూనిట్ ప్రారంభం'

బెల్లంపల్లి: బెల్లంపల్లి కేంద్రంగా కొత్తగా ప్రభుత్వ విజయడెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ ప్రారంభమైంది. కన్నాల బస్తీలో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ను మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పాల డెయిరీని బెల్లంపల్లి చుట్టు పక్క ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాడి రంగంలో సాటి రైతులకు సేవలు అందిస్తున్న బొద్దున వెంకటేష్ అనే రైతుకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామల దేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ బాబు, తెలంగాణ విజయ డెయిరీ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హమాలివాడకు చెందిన పైడిపాల రాజకుమార్(40) ఈ నెల 02 నుంచి కనిపించడంలేదని, అతడి భార్య పైడిపాల స్వప్న మంగళవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'టీడీపీ నాయకుడి ముందస్తు అరెస్ట్'

మందమర్రిరూరల్: ఏరియాలోని సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో మంగళవారం నిర్వహించిన కేకే-5గని విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడేందుకు వెళ్తున్న టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కాసిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు.

ఎండల్లో విద్యా పండుగ ర్యాలీలేమిటి..?

మంచిర్యాలఅర్బన్: మండుతున్న ఎండల్లో విద్యా దినోత్సవం పేరిట విద్యా పండుగ ర్యాలీ నిర్వహించటమేమిటని పలు విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, క్రాంతి, ప్రవీణ్, నితీష్, గోపాల్ ,రాజేశ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఉత్సవాల పేరుతో హన్మకొండ జిల్లాలో ర్యాలీ తీస్తుండగా ప్రమాదవశాత్తు పాఠశాల విద్యార్థి ధనుష్ మృతి చెందారని, కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

రేణుక ఎల్లమ్మ రథోత్సవం

వేమనపల్లి: మండలంలోని రాజారాంలో రేణుక ఎల్లమ్మ రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రేగుంట చంద్రశేఖర్ మంగళవారం దర్శించుకొని, రేణుక ఎల్లమ్మకు కుడక, రైక సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'దశాబ్ది ఉత్సవాలు దండుగ'

భీమిని: దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం దండుగ అని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కుర్మ మనోహర్ అన్నారు. కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువకులు ఉత్సవాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో అశోక్, నవీన్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

'పోస్టు కార్డుల ద్వారా విన్నపం'

పాతమంచిర్యాల: బీసీ జనగణన చేపట్టాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సందెల వెంకటేష్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దం సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న పోస్టుబాక్సు వద్ద మంగళవారం ప్రధానమంత్రి కార్యాలయ చిరునామాకు చేరేలా ఉత్తరాలను పోస్టు చేశారు.

డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లిరూరల్: మహిళా సంఘం సభ్యులు బ్యాంక్ లింకేజీ డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం శ్యామల అన్నారు. మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఆజాది కా మహోత్సవ్ లో భాగంగా బ్యాంక్‌లలో నూతనంగా వచ్చిన డిజిటల్ సేవలపై సభ్యులకు అవగాహన కల్పించారు.

గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్ర

చెన్నూర్‌రూరల్: మండలంలోని చింతలపల్లి, అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో మంగళవారం గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ పాదయాత్రను చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామాల్లో గడపగడపకూ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మొక్కలకు రెండు పూటల నీరందించాలి

చెన్నూర్‌రూరల్: నర్సరీలలో పెంచుతున్న మొక్కలకు రెండు పూటలా నీరందించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు.

విద్యార్థినికి సన్మానం

బెల్లంపల్లిరూరల్: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామానికి చెందిన గోగుల నిత్యశ్రీని, ఆమె తల్లిదండ్రులను ఉపాధ్యాయులు, సర్పంచ్ రంజిత మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఐటీ ఫలితాల్లో ఉన్నతంగా రాణించడం అభినందనీయమన్నారు. భారత ఐక్య విద్యార్థి సమాఖ్య(యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కూడా ఆమెను సన్మానించారు.

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో మంగళవారం గర్భిణీ మహిళలకు ఎంపీపీ స్వర్ణలత న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: తమ సమస్యలను పరిష్కరించాలని అద్దె వాహనదారులు జీఎం సంజీవరెడ్డిని కోరారు. సింగరేణి అన్ని జిల్లాల భూ నిర్వాసితుల అద్దె వాహనాల యాజమానులు, రిటైర్డ్ కార్మికుల పిల్లల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జీఎంను కలిసి వినతిపత్రం అందించారు.

పర్యావరణ సీడీ ఆవిష్కరణ

పర్యావరణంపై కంపెనీ ఉద్యోగులు తీర్చిదిద్దిన లఘు చిత్రం సీడీని జీఎం సంజీవరెడ్డి మంగళవారం ఆవిష్కరించారు.

కారుణ్య నియామక పత్రం అందజేత

శ్రీరాంపూర్ డివిజన్లోని ఎస్ఆర్పీ 1గని ప్రమాదంలో మరణించిన బండారి రాయలింగు కొడుకు శివరామకృష్ణకు కారుణ్య నియామకపత్రాన్ని మంగళవారం జీఎం సంజీవరెడ్డి అందించారు.

ఉపాధ్యాయుల పని తీరు అభినందనీయం

- అదనపు కలెక్టర్ రాహుల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

జన్నారం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ, యూనిఫాం కోడ్‌తో పాఠశాలకు హాజరవుతూ, విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న కలమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల తీరు అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలమడుగు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఆరో తరగతి నుంచి న్యూస్ పేపర్ చదవడం అలవరుచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చక్కగా వినే అలవాటు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. మొదటిసారిగా కలమడుగు గ్రామానికి వచ్చిన ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, హెచ్ఎం ప్రభాకర్, ఎంపీవో రమేశ్, ఉప సర్పంచ్ రాజుగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'పోటీపరీక్షలు రాసేవారికి ఉపయోగం'

దండేపల్లి: పోటీ పరీక్షలు రాసేవారికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే దివాకర్‌రావు, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్ అన్నారు. దండేపల్లి మండలం తాళ్లపేటలో నిరుపయోగంగా ఉన్న జీసీసీ భవనాన్ని డీఎంఎఫ్‌టీ నిధులతో మరమ్మతు చేపట్టి దానిలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవా లని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు మరింత ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, తహసీల్దార్ హన్మంతరావు, మండల ప్రత్యేకాధికారి ప్రకాశ్, ఎంపీడీవో మల్లేశం, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో విద్యకు తొలిప్రాధాన్యం

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



ముల్కల్లలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలటౌన్/మంచిర్యాల రూరల్(హాజీపూర్)/దండేపల్లి/లక్సెట్టిపేట: బీఆర్ఎస్ పాలనలో విద్యకు తొలిప్రాధాన్యం ఇస్తున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. విద్యా దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో పూర్తయిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. మంచిర్యాలలో 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో మోడల్ స్కూల్ కింద ఎంపిక చేసిన న్యూగర్మిళ్ల పాఠశాలలను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. హాజీపూర్ మండలం ముల్కల్లలో ఈజీఎస్ కింద రూ.40లక్షలతో చేపట్టిన పలు సీసీ రోడ్లను, కాలువలను ప్రారంభించారు. రూ.30లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో విద్యా దినోత్సవంలో పాల్గొన్నారు. దండేపల్లి మండలం మామిడిపల్లిలో 'మనఊరు-మనబడి' కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో రూ.19.78లక్షలు, ఉన్నత పాఠశాలలో రూ.52.72లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. లక్సెట్టిపేట మండలం అంకతిపల్లిలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. విద్యార్థుల నిర్వహించిన ర్యాలీ పలువురిని ఆకర్షించింది. పలుచోట్ల విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంలు, సామగ్రి అందజేశారు. ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. నాణ్యతతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, కౌన్సిలర్లు శ్వేత, సత్యనారాయణ, సురేశ్‌బల్దువా, సెక్టోరల్ అధికారి చౌదరి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతలకు సత్కారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యాదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విద్యా సంస్థలకు చేయూతనందించిన ముగ్గురు దాతలను జిల్లాలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. హాజీపూర్ మండలం సబ్బెపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మాజీ ఎంపీపీ మాధవరపు వినయ్‌ప్రకాశ్‌రావు రూ.7లక్షల 20వేలు విరాళం, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, రైతుబంధు సమితీ మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాస్ దంపతులు సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1గుంట స్థలం విరాళం, ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానికుడు గోనె సతీశ్‌రావు రవాణా సౌకర్యం నిమిత్తం రూ.4లక్షల విలువ గల టాటా ఏస్ వాహనం కొనుగోలు చేసి విరాళంగా అందజేయడంతో వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం వేడుకల్లో భాగంగా మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య చేతుల మీదుగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.

'హరితోత్సవం' వివాదాస్పదం

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇంటర్మీడియెట్ ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్ష కేంద్రం ఆవరణలో సోమవారం హరితోత్సవంలో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా మొక్కలు నాటిన కార్యక్రమం వివాదాస్పదమైంది. సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్మీడియెట్ ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు విద్యార్థులు ఆ కళాశాలలో పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. ఈ పరీక్ష కేంద్రంలో 7గురు విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, ఆ సమయంలోనే మొక్కలు నాటే కార్యక్రమం చూసి, ముగ్గురు విద్యార్థులు పరీక్ష లేదేమోనని భ్రమపడి, పరీక్ష కేంద్రం ఆవరణలో కనిపించిన హడావుడి చూసి లోనికి వెళ్లకుండానే ఇంటికి వెళ్లిపోయినట్లుగా తెలుస్తోంది. నలుగురు విద్యార్థులు మాత్రం యథావిధిగా పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న సమయంలో, మరీ ముఖ్యంగా పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ అమలులో ఉన్న వేళ నిబంధనలను పక్కకు పెట్టి, మున్సిపల్ అధికారులు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. పరీక్షల వేళ కళాశాల ఆవరణలో మొక్కలు నాటడానికి కళాశాల అధ్యాపకులు వద్దని చెప్పినా మున్సిపల్ అధికారులు పెడచెవిన పెట్టి, కార్యక్రమం పూర్తి చేసి ముగ్గురు విద్యార్థులు పరీక్ష రాయకుండా ఇంటికి వెనుదిరిగేలా వ్యవహరించారని విద్యార్థిసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన్నయ్యతోపాటు జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.

'విద్యారంగంలో తెలంగాణ నంబర్ వన్'



మోడల్ స్కూల్ విద్యార్థులతో మాజీ ఎమ్మెల్సీ

కోటపల్లి: విద్యారంగంలో దేశంలోనే తెలంగాణా నంబర్ వన్‌గా ఉందని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ ఉత్సవాల్లో పాల్గొని పాఠశాలలో ఇంటర్, పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను శాలువాతో సత్కరించి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అడవులపై అవగాహనకు సఫారీ ప్రయాణం'

జన్నారం: అడవులపై అవగాహన పెంచేందుకు, వన్యప్రాణుల, అడవుల సంరక్షణకు అటవీ అధికారులు తీసుకుంటున్న చర్యలు తెలియజేసేందుకు జన్నారం మండల ప్రజాప్రతినిధులు జంగిల్ యాత్ర చేశారు. ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ తో పాటు సర్పంచ్, ఎంపీటీసీలు మంగళవారం ఉదయం జన్నారం డివిజన్ కార్యాలయం నుంచి జంగిల్ సఫారీ ద్వారా బయలుదేరారు. తాళ్లపేట్, ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లలోని పలు ప్రదేశాల్లో సఫారి ప్రయాణం చేస్తూ అడవిలో అభివృద్ధిని గమనించారు. అడవిలో జరుగుతున్న పనులు, బేస్‌క్యాంపు సిబ్బంది పనులు, అడవుల, వన్యప్రాణుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను ఎఫ్‌డీవో మాధవరావు వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రామకృష్ణాపూర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వివేకానంద యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ర్యాలీ చేపట్టారు. యోగాపై అవగాహన కల్పిస్తూ పలు ప్రధాన కూడళ్లలో ఆసనాలు వేశారు.